# పారమార్థికమందు వ్యావహారికము లీనమై ఉంటున్నది

శాస్త్రంబునెప్పుడు సత్యంబుగానెంచు
వేదసమ్మతమగు విప్రులార
దేశంబు కొరకునై దేహమర్పణ చేయు
రహిమించు రాజాధిరాజులార!
ధనధాన్యములు కల్గి ధర్మగుణాలతో
అలరుచుండెడి ఆర్యవైశ్యులార!
వ్యవసాయవృత్తిలో వర్థిల్లుచుండియు
సుఖజీవనము చేయు శూద్రులార!
కాలమంతయు నూరక గడపనేల?
సర్వజన సమ్మతంబగు సత్యమైన
భక్తిమార్గము గొనుడిహపరములిచ్చి
సత్యముగ మిమ్ము సాకును సాయిబాబ.

విద్యార్థులారా!

వేదాంతమునందు తారకము, సాంఖ్యము, అమనస్కము ఈ మూడు ఏ విధముగా త్రిమూర్త్యాత్మక స్వరూపమై ఉన్నవో అదే విధముగా వేదాంతమందు పారమార్థికము, ప్రాతిభాసికము, వ్యావహారికము అనికూడను మూడు మార్గములుంటున్నవి. ఈ పారమార్థికము ఒక సముద్రము. వ్యావహారికమే ఈ సముద్రమునందలి అలలు. ప్రాతిభాసికము అలలయందున్న నురుగు. అలలులేక నురుగులేదు. నీరులేక అలలులేవు.

sri sathyasai vahamrutam

ఏతావాతా అలలు, నురుగు రెండూ సముద్రము నీటితో చేరినవి. పారమార్థికము వేరు, వ్యావహారికమువేరు, ప్రాతిభాసికము వేరని మనం భావించకూడదు. ఈ మూడు త్రిమూర్త్యాత్మక స్వరూపమే! ఈ మూడు త్రిగుణములయొక్క స్వరూపమే! ఈ మూడు త్రిశూలముయొక్క స్వరూపమే!

**పారమార్థికములేక వ్యావహారికము ఉండుటకు వీలుకాదు**

**త్రిగుణం త్రిదళాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం.**

మూడింటియొక్క ఏకత్వము గుర్తింపచేసేదే దివ్యత్వమైన పరబ్రహ్మతత్త్వము. పారమార్థికము ఆత్మ అనియు, వ్యావహారికము అహంకారమనియు భావిస్తారు కొందరు అజ్ఞానులు. ఇవి రెండూ ఒక్కటికాదు. అత్మ, అహం ఇవి ప్రత్యేకించినవి. ఆత్మ సముద్రము. ఈ అహం అలలు. అయితే అంతర్దృష్టితో మనం విచారణ చేసినప్పుడు రెండు ఒక్కటిగానే కనిపిస్తాయి. సముద్రముకంటె అలలు వేరుకాదు. కట్టెయందు అగ్ని ఇమిడి ఉండినట్టుగా, తిలయందు తైలము చేరినట్టుగా, చెఱకునందు చక్కెర ఉండినట్టుగా పారమార్థికమందు వ్యావహారికము లీనమై ఉంటున్నది. సముద్రములేక అలలులేవు. అదే విధముగా తండ్రిలేక కుమారుడులేడు. కుమారుడులేని తండ్రి ఉండవచ్చుగానీ తండ్రిలేని కుమారుడు ఉండటానికి వీలుకాదు. అదే విధముగా పారమార్థికములేక వ్యావహారికము ఉండుటకు వీలుకాదు. కనుక, భగవంతుని 'భావాయనమః' అన్నారు. వేదాంతమునందు 'భావః' అన్నారు. 'భావః' అంటే ఏమిటి? 'భావః' అనగా దృశ్యకల్పితమైన ఈ చరాచర ప్రపంచమంతయు తన స్వరూపముగా నిరూపించే వాడే భావస్వరూపుడు.

**కార్యకారణస్వరూపమే జగత్తు**

జగత్తు కేవలము కార్యస్వరూపము. కారణము విష్ణువు. కార్యకారణస్వరూపమే జగత్తు. జగత్తునందు భగవంతుడు అనేక అంగములతో, అనేక రూపములతో దిగివచ్చి సర్వరూపముల సమన్వయము బోధిస్తున్నాడు. చక్కని రంగుల పింఛముతోకూడిన నెమలి ఏ విధంగా అందముగా ఉంటుందో సర్వమానవత్వమును చేర్చుకున్న విష్ణుత్వము అంత



srisathyasaivachanamrutam

సుందరముగా ఉంటుంది. దీనినే వేదము 'సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్'. అనేక శిరస్సులతో కూడినది ఈ విశ్వము. అనేక నేత్రములతో కూడినది ఈ విశ్వము. అనేక పాదములతో కూడినది ఈ విశ్వము. దీనిని పురస్కరించుకొని మనము విచారించిన ప్రతివ్యక్తి విష్ణుస్వరూపమే! అదే విధముగా భగవంతునకు 'కూటస్థుడు' అని రెండవపేరు. కూటస్థుడు అనగా భగవంతునియందు అన్నింటి ఏకత్వము నిరూపించే తత్వము ఉంటున్నది. నురుగు, అల, సముద్రము మూడింటి ఏకత్వము ఏ విధంగా ఉంటున్నాదో దివ్యత్వములోనుండిన సృష్టి, స్థితి, లయములుకూడను కూటస్థమైన స్థితికి చేరుకుంటాయి. అంతా సచ్చిదానంద సాగరమునుండి ఏర్పడినవే. ఇదియే మానససరోవరమునుండి ఆవిర్భవించిన ఆనందము. ఈ ఆనందమునకు మూలకారణము, సత్‌చిత్. సత్ అనగా సత్యము. చిత్ అనగా జ్ఞానము. ఈ రెండింటి ఏకత్వమే ఆనందము. సత్ అనేది చక్కెర. చక్కెర దేనియందున్నా మాధుర్యముగానే ఉంటుంది. కాఫీలో చేర్చు, మధురంగానే ఉంటుంది. టీలో చేర్చు, మధురంగానే ఉంటుంది. పాయసంలో చేర్చు, మధురంగానే ఉంటుంది. నీటిలో చేర్చు, మధురమైన పానకంగానే ఉంటున్నాది. ఈ చక్కెర తీపిదనము ఎప్పటికి ఉండేదే. సత్ అనగా Being, మార్పులేనిది. అదే చక్కెర. చిత్ ప్రాణసంబంధమైన తత్త్వమును ప్రబోధించి ప్రజ్ఞానం బ్రహ్మ constant integrated awareness ను ప్రబోధించేది. ఇది ఎప్పుడు సజీవంగానే కదులుతుంది. ప్రాణమునకు ఆ జలము ప్రధానము. కనుక చిత్ అనేది నీరు, సత్ అనేది చక్కెర. ఈ రెండు విడివిడిగా ఉంటుంటే చక్కెర చక్కెరే, నీరు నీరే. రెండు చేర్చినప్పుడు పానకంగా తయారౌతుంది. అదే విధముగా సత్, చిత్ రెండూ చేరినప్పుడే ఆనందము రూపొందుతుంది. ఆనందము మన స్వరూపమే! సత్ అనే ఆత్మతత్త్వము నిరంతరము ఉండేదే!

### శ్రద్ధ, విశ్వాసము, ప్రేమ ఈ మూడింటియందు ఏకత్వముండాలి

ఆత్మతత్త్వమే లేక జగత్తులో దేనికి రాణింపులేదు. సూపర్ స్పెషల్ పేపరు ఉంటున్నది, చాలా విలువైన పేపరు. దానిపై అక్షరములు రాస్తే అందముగా ఉండే అక్షరములు. ఆ letters ఎట్లా ఉంటున్నాయి? అందమైన కవిత్వముగా ఉంటున్నాయి.

srisathyasaivachanamrutam

**"వాసుకిశయన శ్రీనివాస చిద్విలాస భవపాశముల ద్రుంచి**
**మనోల్లాసమివ్వరా, భాసురకళ్యాణపురవాసుడౌ**
**శ్రీశేషగోపదాసుని బ్రోచేటి జగదీశ ఋషికేశ వేగ బ్రోవరారా**
**శ్రీరమారమణీ మనోహరా ఆశ్రిత జన శుభకరా!"**

ఎంత అందముగా ఉంటున్నాడు. ఇది కవిత్వము. ఈ కవిత్వముతో పేపరు అంతా నిండి యుండి.

**సందుగొందులందు మరి అందరందు నీవె**
**ఆనందమొందుచుందువని విందు శ్రీధరా!**
**ఇందువదన సురేంద్ర బృందవందిత పాదారవింద**
**నిత్యానంద గోవింద వేగ బ్రోవరారా!**
**శ్రీరమారమణీ మనోహరా ఆశ్రిత జన శుభకరా!"**

ఇలాంటి సుందర కవిత్వముతోకూడిన ఉత్తరము వ్రాశారు. కాగితము విలువైనదే! అక్షరములు చాలా అందమైనవే! కవిత్వముకూడా విచిత్రమైనదే! కానీ కవరులో పెట్టాము. కవిత్వమునకు విలువ ఉంది. అక్షరములకు విలువ ఉంటున్నాది. కవరుకు విలువ ఉంటున్నాది. కాగితమునకు విలువ ఉంటున్నాది. ఎడ్రసు వ్రాసి పోస్టు చేశారు. కానీ ఎవరికి చెందాలో వారికి చెందలేదు. దేనివల్ల? స్టాంపు లేదు. అదే విధంగా రాగతాళములతో మనం భజన చేస్తున్నాము. అన్నింటియందు అందచందములు ఉంటున్నాయిగానీ ఆత్మ విశ్వాసమనే స్టాంపు లేదక్కడ. ఆత్మవిశ్వాసమనే స్టాంపు దానిపై వేయాలి. ఈ కాన్ఫిడెన్సులేదు. శ్రద్ధ, విశ్వాసములకు తగిన ప్రేమ. ప్రేమ ఉండినప్పుడే శ్రద్ధ వస్తుంది. శ్రద్ధ ఉండినప్పుడే విశ్వాసము వస్తుంది. కడపటికి విశ్వాసము, శ్రద్ధ, ప్రేమ మూడు వేరుకాదు, ఒక్కటే! నురుగు, అల, సముద్రము ఎట్లా ఒక్కటై పోయిందో శ్రద్ధ, విశ్వాసము, ప్రేమ ఈ మూడింటియందు ఏకత్వము కలగాలి. ఇదే వేదాంతమునకు సరైన ఆధారము. ఈ వేదాంతమునందు ఇచ్ఛ, పరేచ్ఛ, అయేచ్ఛ మూడింటియందున్న అంతరార్థము ఏమిటి?

srisathyasaivachanamrutam

ఇచ్ఛ అనగా స్వేచ్ఛ అనికూడా చెప్పవచ్చును. స్వేచ్ఛ, పరేచ్ఛ, అయేచ్ఛ.

**ఆత్మధర్మమే స్వధర్మము**

స్వేచ్ఛ అనగా ఈనాటి విద్యార్థులందరు యిష్టానుసారం మాట్లాడటము, యిష్టానుసారం సంచరించటం, యిష్టానుసారం ప్రవర్తించటం స్వేచ్ఛ అనుకుంటారు. ఇదికాదు, స్వేచ్ఛకు అంతరార్థము. స్వా, ఇచ్ఛ-స్వేచ్ఛ. ఆత్మ యిచ్ఛయే నిజమైన స్వేచ్ఛ. ఆత్మ యిచ్ఛను మనము అనుసరించాలి. ఈ ఆత్మతత్త్వమే నేను అనే పదమునకు ఆధారము. అయితే ఈ 'I' అనేది రెండురకములుగా ఉపయోగిస్తున్నారు, యీ ప్రపంచములో. దీనిని పురస్కరించుకొనియే గీతయందుకూడా పరధర్మ, స్వధర్మ అన్నారు. స్వధర్మమనగా క్షత్రియధర్మము, బ్రాహ్మణధర్మము, వైశ్యధర్మము, ఇలాంటి జాతిమత కులములకు సంబంధించినవిగా స్వధర్మమును భావిస్తున్నారు. ఇదికాదు స్వధర్మము. 'స్వ' అనగా ఆత్మ. ఆత్మధర్మమే స్వధర్మము. పరధర్మము అనగా దేహధర్మము. కాబట్టి 'నేను' రెండు రకములుగా ఉంటున్నాది. ఒకటి ఏకాక్షరం 'I'. రెండవది 'Eye' మూడు అక్షరములు. 'Eye' దేహము. ఏకాక్షర 'I' ఆత్మ. దేహములేక ఆత్మను తెలుసుకోలేము. ఆత్మలేక దేహము ఉండటానికి వీలులేదు. కాబట్టి, దేహాత్మజీవతత్త్వము మూడింటి ఏకత్వమైన త్రిపుటి, త్రికూటము అన్నారు. ఈ విధముగా వేదాంతము చిన్న చిన్న పదములతో పవిత్రమైన మార్గాన్ని నిరూపిస్తూవచ్చింది. "స్వేచ్ఛ అనగా తానే సంకల్పించి 'నేనే కార్యమును చేస్తున్నాను' అని నిర్ణయించి ఆ కార్యములు చేసి ఆ కార్యములవల్ల వచ్చిన ఫలితము సుఖమో దుఃఖమో ఏమాత్రము విచారించక ఇది నేనే అనుభవించాలి. ఎందుకనగా నేనే దీనిని కోరి వరించి ప్రవర్తించాను. నేను ఇష్టపడే చేశాను, ఈ పనిని. ఈ ఇష్టపడి చేసిన దానివలన దుఃఖమురానీ ఆనందమురానీ అది నేను అనుభవించే తీరాలి. దీనికి ఏ మాత్రము వెనుకంజ వేయకూడదు" అనే విశ్వాసముతో చేసేది. ఇంక పరేచ్ఛ. అనగా ఇతరుల ప్రోత్సాహమువలన, వత్తిడివలన కార్యములో పాల్గొంటున్నాము. ఇది స్వేచ్ఛతో చేసినదికాదు. ఇతరుల ప్రోద్బలముచేత ఇతరుల వత్తిడిచేత, ఒక కర్మను నీవు అచరించావు. అయితే అప్పుడుకూడా 'నేను

sri sathyasai vachanamrutam

ఇష్టపడి చేసినది కాదే' అని ఏమాత్రము విచారించకూడదు. ఇతరుల force వల్ల జరిగినా ఇది నేనే చేశాను. చేసినది నేను, ప్రోత్సాహము వారిది. నిజముగా చేయటానికి ఉత్సాహమే నాలో లేకపోతే ప్రోత్సాహము ఏమి చేస్తుంది? కాబట్టి ఉత్సాహము నాలో ఉండినప్పుడే ప్రోత్సాహము కొంచెం help చేసింది. ప్రోత్సాహములో చేసినదికూడను నేనే అనుభవించాలి అని భావించాలి. మూడవది 'అయేచ్ఛ'. ఇది ప్రోత్సాహముకాదు లేక నా సంకల్పముకాదు. ఇది కేవలము దైవేచ్ఛగా లభ్యమైనది. దైవేచ్ఛగా లభించే సుఖముగానీ దుఃఖముగానీ ఆనందముగా అనుభవించాలి. ఇది ఇంకొకరి వత్తిడికాదు. లేక తానై ఆచరించినదికాదు. దైవేచ్ఛగా వచ్చినది. దైవేచ్ఛగా వచ్చినప్పుడు కేవలం మంచే జరుగుతుంది. దైవేచ్ఛగా జరిగిన ప్రతికార్యమందు మాధుర్యము, విజయము, శాంతి, ఆనందము, సౌఖ్యము ఇవన్నీ చేకూరుతుంటాయి.

**కర్మఫలము అనుభవించే తీరాలి**

ఈనాటి మానవుడు ఈ విశాలమైన అర్థము తీసుకోటంలేదు.

> **పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః**
> **న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః.**

పాపఫలము నాకు వద్దంటున్నాడేగానీ పాపకార్యము చేస్తున్నాడు. పాపకార్యముయొక్క ఫలితము వద్దు అనేవాడు పాపకార్యము ఎందుకు చేయాలి? నీ పాపకార్యముచేతనే నీకు పాపఫలము వస్తున్నాది. పుణ్యఫలము కావాలని ఆశిస్తున్నావు. కానీ పుణ్యకర్మలు చేయటానికి ముందంజ వేయటంలేదు. ఎందుకు? కావాలని కోరేది ఒకటి, దానికి విరుద్ధముగా కర్మలు ఆచరించటము. నీ ఆశలు పురస్కరించుకొనే నీ కర్మలు ఉంటుండాలి. పాపఫలము నీవు వద్దనకూడదు. నేను పాపము చేశాను, తప్పక ఫలితము రావలసిందే!' అనుకోవాలి. తెలిసి ముట్టినా, తెలియక ముట్టినా అగ్ని కాలుస్తుందే గానీ తెలియక ముట్టాడని అగ్ని చల్లబడదు. నీవు ఇష్టపడినా యిష్టపడకుండా పోయినా నీ కర్మఫలము అనుభవించే తీరాలి. ఇది వ్యావహారిక సత్యము. కానీ, పారమార్థిక సత్యము అలాంటిది కాదు. అగ్ని ఉండినప్పటికిని నీవు దానిని ముట్టినప్పటికిని, అది నిన్ను కాల్చకుండా

sri sathyasai vachanamrutam

ఉంటుంది. ఏవిధంగా? కేవలము దైవానుగ్రహముచేతనే! దానివల్ల ముందుగానే అగ్ని ఉంది అనే జ్ఞానము నీకు అందిస్తుంది. అగ్నికూడాను దైవతత్త్వముగానే విశ్వసించాలి.

**సచ్చిదానందము మానవునియందే ఉంటున్నది**

పంచభూతములలో అగ్నికూడా ఒకటి. కనుక ప్రతి ఒక్కదానియందు అహం అనేది ప్రవేశిస్తున్నది. ఈ అహంతత్త్వము ఎక్కడనుంచి పుట్టినదని విచారణ చేయాలి. అహం అనేది ఆత్మనుండి పుట్టింది. అహంనుంచి ఏది పుట్టింది? సంకల్పము పుట్టింది. సంకల్పమునుండి ఏది పుట్టింది? వాక్కు పుట్టింది. వాక్కు సంకల్పమునుండి, సంకల్పము అహంనుండి, అహం ఆత్మనుండి పుట్టింది. ఈ విధంగా తీసుకుంటే ఇది త్రిపుటి. ఈ వాక్కు ఆత్మకు మునిమనుమడు. సంకల్పము మనవడు. అహం కొడుకు. ఇదంతా ఒకే కుటుంబముయొక్క సంబంధమే! మనుమడు, మునిమనుమడు, కొడుకుకు ఆత్మ ప్రోపర్టీలో హక్కు ఉంటున్నాది. ఆత్మయొక్క ప్రోపర్టీ ఏమిటి? సత్‌చిత్‌ఆనందము. ఈ సత్‌చిత్ ఆనందము, కుమారునికి, మనుమనికి, మునిమనుమనికి సంపూర్ణముగా పంచి ఉంటున్నాది. మానవుడు 'ఆనందము లేదు, నాలో' అనుకోకూడదు. ఇది మీ హక్కు. నిరంతరము సత్యనిత్యమైనవాడుగా ఉండాలని ఆశిస్తున్నావు. అదే Being. అదే నీ హక్కు. చిత్ ఏమిటి? 'ప్రజ్ఞానం బ్రహ్మ'. ఆ ప్రజ్ఞానము నీయందే ఉంటున్నాది. కనుక సత్‌చిత్‌ఆనందము ఎక్కడ ఉందని వెతకనక్కరలేదు. నీయందే ఉంటున్నాది సచ్చిదానందము. అయితే, నీవు తెలుసుకోలేకపోవటంచేత పట్టి పీడిస్తున్నాది, అజ్ఞానము.

**ఆత్మ, అనాత్మల విచారణ జరిపినప్పుడే అజ్ఞానము అంతర్ధానమై పోతుంది**

విద్యార్థులారా! దీనికి చిన్న కథ ఉంటున్నాది. ఒక వివాహము జరుగుతున్నది. కన్యవైపువారు ఒక ఇంటిలో ఉన్నారు. వరునివైపువారు ఒక ఇంటిలో ఉంటున్నారు. మధ్యలో సంధానము జరుపుటకు ఒక సంబంధి ఏర్పడ్డాడు. కన్యవైపున వారిని ప్రతి పర్యాయము వెళ్లి డబాయిస్తున్నాడు. 'ఏమిటండి వేళవేళకు మాకు టిఫిన్ కాఫీ సప్లై చేయటంలేదు. వివాహము చాలా గ్రాండ్‌గా చేస్తారనుకున్నాము. ఏమీ చేయటంలేదే, ఏమీ శ్రద్ధ చూపటంలేదే' అని హడావుడి చేస్తున్నాడు. మరొక పర్యాయము అవతలివైపున



sri sathyasai vachanamrutam

వస్తున్నాడు. 'ఏమిటి? మీరు ఎన్ని పర్యాయములు పిలచినా రావటంలేదే! వంటలంతా చల్లబడిపోతున్నాయి. తప్పకరండి, త్వరగా'! అని వరునివైపు వారిని జబర్దస్తి చేస్తున్నాడు. వరునివైపు వారి దగ్గరకు వచ్చి జబర్దస్తీ చేస్తున్నప్పుడు కన్యవైపువాడిగా ఉంటున్నాడు పెద్ద యజమాని అనుకున్నారు. కన్యవైపుకి పెళ్లి జబర్దస్తి చేస్తున్నప్పుడు వరునివైపు యజమానిలాగా వారు తలచుకుంటున్నారు. ఇలా ఇతని స్వతంత్రము పెచ్చు పెరిగిపోయింది. ఇరువైపులవారికి విసుగుపుట్టింది. అప్పుడు విచారణ ప్రారంభించారు. 'ఎవరండీ ఇతను?' అని. వరునివైపువారు వచ్చి 'ఎవరండి ఇతను?', అని అడిగారు. 'మాకు తెలియదండి', అని వీరన్నారు. కన్యవైపువారు వచ్చి 'ఎవరండి ఇతను?' అన్నారు. 'మాకేమి తెలియదు' అన్నారు. ఇరువురు కలసి విచారణ చేసేటప్పటికి ఇతను పరారి! 'గుట్టు బట్టబయలైంది', అని తప్పించుకుని పరుగెత్తాడు. అదే విధంగా అజ్ఞానము ఒక పర్యాయము ఆత్మవైపున, ఒక పర్యాయము ప్రకృతివైపు పయనించి ప్రకృతిని, ఆత్మను జబర్దస్తి చేస్తుంటాది. 'ఆత్మ, అనాత్మ discrimination జరిపినప్పుడే enquiry సల్పినప్పుడే అజ్ఞానము అంతర్ధానమైపోతుంది. అట్టి enquiry ఈనాడు మనం జరపడంలేదు. ఆత్మయాఅనాత్మనా, ప్రాకృతమైనదా, పరార్థమైనదా అనే విచారణ మనం చేయకుండాపోవటంచేత మనలను అనేక విధములుగా పీడిస్తున్నాది. విచారణ చేయటానికి నాలుగు మార్గములుంటున్నాయి. మీకందరికి తెలుసు. మీయందుండినది bookish knowledge. కొన్ని దినముల తరువాత superficial knowledge గా మారిపోతుంది. ఈ superficial knowledge తరువాత general knowledge వస్తుంది. General knowledge వచ్చినప్పుడే discrimination knowledge చూడాలి. ఆ discimination, individual discriminationగా ఉండకూడదు. Fundamental discrimination కావాలి. Discrimination knowledge తరువాత practical knowledge వస్తుంది. ఈ practical knowledge నిత్యసత్యమైనది. అట్టి సత్యమువరకు మనం ప్రయాణమవుతూ పోవాలి. ఈ విధముగా enquiry చేస్తూపోయినప్పుడే సత్యము మనకు చక్కగా తెలుస్తుంది.

**భూత, వర్తమాన, భవిష్యత్తులు మూడూ ఏకత్వమేనని విశ్వసించినవాడే జీవన్ముక్తుడు**

sri sathyasai vachanamrutam

'విదేహముక్తి', 'జీవన్ముక్తి' అని రెండు ఉంటున్నాయి. ఈ రెండూ వేదాంతములో చాలా ప్రధానమైనవి. జీవన్ముక్తి అనగా ఏమిటి? శరీరము ధరించికూడా సర్వము ఏకత్వమే అని విశ్వసించడం. భూత, వర్తమాన, భవిష్యత్తులు మూడూ ఏకత్వమే! పూర్వము వృక్షముగా ఉంటున్నది. దానినుంచి ఈ వర్తమానమనే విత్తనము వచ్చింది. విత్తనము భవిష్యత్తులో వృక్షముగా మారుతుంది. భూతము వృక్షము, వర్తమానము విత్తనము, భవిష్యత్తు వృక్షము. మూడింటి ఏకత్వము ఒక్కటే! ఆ వృక్షములేక విత్తనము రాలేదు. విత్తనములేక వృక్షము రాదు. ఇదే ఏకత్వము. ఈ మూడింటి ఏకత్వమును విశ్వసించినవాడు జీవన్ముక్తుడు. కష్టమును, సుఖమును రెండింటిని సమముగా చూసేవాడు జీవన్ముక్తుడు. మంచివారు పొగుడుతూ వర్ణించినా, చెడ్డవారు దూషించినా, రెండింటిని సమత్వముగా భావించేవాడు, జీవన్ముక్తుడు. దూషణభూషణ, తిరస్కారములన్నింటిని ఏకత్వముగా విశ్వసించినవాడు జీవన్ముక్తుడు. దరిద్రము, సంపద రెండింటిని సమత్వముగా విశ్వసించినవాడు జీవన్ముక్తుడు. అన్నీకూడా కదలిపోయే మేఘములే! ఏదికూడను శాశ్వతమైనది యిక్కడలేదు. ఇట్టి సత్యము గుర్తించినవాడు జీవన్ముక్తుడు. అతనికి విచారము ఉండదు. ఎందుకనగా మనస్తత్వము ఏకత్వములో ఉంటున్నది. అట్టివాడే జీవన్ముక్తుడు. అయితే విదేహముక్తుడంటే ఏమిటి? విదేహమందు ఇలాంటి గుణములే ఉంటున్నాయి. ఇరువురికి ఉండిన భేదము ఏమిటి? ఇతనికి దేహము ఉంది. అతనికి దేహములేదు. విదేహుడనగా దేహములేనివాడు. అనగా దేహము ఉంది, కాని దేహముపైన concentration చేయటంలేదు. ఆకలిదప్పులు ఏమాత్రము ఎరుగడు. ఇలాంటి జీవన్ముక్తితత్వములో విదేహముక్తి దానికి ప్రతిబింబమే. జనక మహారాజుకు విదేహుడు అని పేరు. దేహభ్రాంతి అతనికి లేదు. అందువలననే విదేహుడని పేరు.

**దేహభ్రాంతి ఉండినంతవరకు సుఖదుఃఖములు తప్పవు**

దేహభ్రాంతి ఉండినంతవరకు మనసు సుఖదుఃఖములు తప్పునవి కాదు. దేహాభిమానము లేనప్పుడు యింక ఏ అభిమానము లేదు. అదే అమనస్కము. మనస్సేలేదు. మనస్సులేనివానికి ఆలోచనలు ఎక్కడనుండి వస్తాయి? ఆలోచనలుంటేనే మనస్సు. ఇది

sri sathyasai vahini amrutam

వస్త్రము. వస్త్రమునకు దారముండాలి. దారమునకు పత్తి ఉండాలి. పత్తి దారమైంది. దారము వస్త్రమైంది. పత్తిలేకపోతే దారమేలేదు. దారము లేక వస్త్రములేదు. కాబట్టి పత్తి అదే సంకల్పము. దారము కోరికలు. దారముల సమ్మిళితస్వరూపమే వస్త్రమనే మనస్సు. Bundle of desires is mind. కోరికలు లేనప్పుడు మైండు లేదక్కడ. అందువలననే అమనస్కము అన్నారు.

**మాయకు లోనాయె మాయకు తావాయె**
**మాయ యిరవైఐదు మంత్రములాయె**
**మాయ యిరవైఐదు మంత్రము తెలిసితే**
**మాయ మాయ మాయ మరి బయలాయె.**

25 మంత్రములు ఏమిటి? 5 కర్మేంద్రియములు, 5 ప్రాణములు, 5 కోశములు, పంచభూతములు నాలుగు చేరి 20. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము నాలుగు, తరువాత జీవతత్త్వము అన్నీ కలిపి 25. ఈ 25 తత్త్వములతోకూడినది పిండము. పిండము అనగా దేహము. అండపిండబ్రహ్మాండము. గుడ్డునుండి పుట్టినది అండము. తల్లిగర్భమునుండి పుట్టినది పిండము. సర్వత్రా ఉండినది బ్రహ్మాండము అన్నారు. మన దేహమందు ఈ మూడు ఉంటున్నాయి. అండపిండబ్రహ్మాండముయొక్క ఏకత్వమే త్రిపుటియొక్క ఏకత్వము. అదే త్రికూటమి. కూటమి అనగా చేరటము. శ్రీరామచంద్రుడు త్రికూటపర్వతముపై ఉంటున్నాడు. ఎక్కడ కూటమి? జీవ, ఈశ్వర, ప్రకృతి మూడింటియొక్క కూటమి.

**జాగత్స్వప్న సుషుప్తులయందు ఏకత్వమైనదే తారకం**

రామతత్త్వము ఏమిటి? 'రా' అనగా ఆత్మ, 'మ' అనగా మాయ. మాయ ఆత్మతో చేరినప్పుడు రామతత్త్వమైపోతుంది. రామజపమంటే 'రాంరాంరాం' అని జపం చేయటం కాదు. మైండు భగవంతుని(ఆత్మ)తో ఏకం కావాలి. అదే నిజమైన రామజపము, అదే నిజమైన తారకతత్త్వము. తారకమంటే ఏమిటి? తెర మరపు పడకుండా, అనవరతము అరమరలులేకుండా ఎప్పుడూ తరచుగా జీవాత్మ చదివెడి తారకం. జాగ్రత స్వప్న



sri sathyasai vachanamrutam

సుషుప్తులందు ఏకత్వమైనదే తారకం. ఇటువంటి తారక తత్త్వము గుర్తించుకోలేక 'రాంరాం' అని జపము చేసిన చాలదు. మన మనస్సును ఆత్మతో ఏకం చేయాలి. చూడండి. చక్కెర తెచ్చావు. గ్లాసులో నీరుంటున్నాది. ఆ నీటిలో పోశావు, కలిపావు. తరువాతచూస్తే చక్కెర చేతికి చిక్కదు. చూశావు, నీటిలో చక్కెర కనిపించటంలేదు. ఎక్కడకుపోయింది. నీ చేతితో తెచ్చావు. నీ కండ్లతో చూచావు. ఆ చక్కెర ఇప్పుడు చేతికి చిక్కటంలేదు. కంటికి కనిపించటంలేదు. ఎక్కడకి పోయింది? నీ చేతితోనే తెచ్చావు. నీ కన్నులతోనే చూచావు కానీ కంటికి కనుపించటంలేదు, చేతికి చిక్కటంలేదు. ఇక్కడ చక్కెర ఉందని ఎట్లా గుర్తించగలవు? నాలుకపైన వేసుకున్నప్పుడు చక్కెర ఉందని తెలుస్తుంది. ఇంకొకటి. పిల్లలకు ఈ కప్పులో జ్యూస్‌పోసాము. పండ్లరసము పోశాము. పండ్లరసము కప్పులో వుంటున్నాది. కానీ పండ్లరసముయొక్క రుచి కప్పుకు తెలియదు. తననిండా నింపుకుంది, కానీ కప్పుకి తెలియదు. స్ట్రా వేశావు. స్ట్రానుండి నీవు తీసుకుంటున్నావు. రసము స్ట్రానుండి పోతున్నది కానీ స్ట్రాకి తెలియదు. నాలుకపై పడేటప్పటికి దాని రుచి తెలుస్తున్నాది. చూశారా ఎక్కడ రుచి తెలుస్తున్నది? నాలుకపైన తెలుస్తున్నది. మన దేహమే ఒక కప్పు. దీనిలో 'రసో వైసః' రసస్వరూపుడైన దైవముంటున్నది. దేహానికి తెలియటంలేదు. మన ఇంద్రియములు స్ట్రా. ఈ ఇంద్రియములతో అన్నీ మనము అనుభవిస్తున్నాము. కానీ, దానికికూడా ఏమీ తెలియటంలేదు. బుద్ధి, అదే నాలుక, ఆ బుద్ధికి మాత్రం తెలుస్తున్నది. నాలుకకి తెలుస్తున్నది కాని అనుభవించటంలేదు. అది తిరిగి జఠరమునకు పంపుతున్నది. జఠరమునకుకూడా తీపి తెలియటంలేదు. జీర్ణము చేస్తున్నాది. మాలిన్యమును పక్కకు నెట్టుతున్నాది. పవిత్రమైన నిర్మలమైన జ్యూసును సర్వాంగములకు సప్లై చేస్తున్నది. అదే జఠరాగ్ని

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.**

నేను నీ కడుపులో వైశ్వానరుడుగా ఉండి నీవు తిన్నది జీర్ణముచేసి నీ దేహానికి సప్లై చేసి శక్తిని ఇస్తున్నాను. ఈ విధంగా వేదాంతవిషయము చక్కగా విచారణ చేస్తూవస్తే కట్టకడపటికి

srisathyasaivahini.org (watermark)

తేలేది ఒక్కటే, 'ఏకంసత్ విప్రాః బహుధా వదంతి'. Truth is one, not two. అంత ఖచ్చితంగా చెబుతూ వచ్చింది.

## దైవము ఒక్కడే!

వేదాంతము నేను ఒక్కటే, అని చెప్పటం లేదు. 'నేను ఒక్కటే ఒక్కటి; రెండుకాదు' అని గట్టిగా చెబుతున్నాది. గంట కొట్టినట్టుగా చెబుతున్నాది, ప్రబోధిస్తున్నాది, ప్రచారము చేస్తున్నాది ప్రపంచమునకు. దైవము ఒక్కడే, అల్లా ఒక్కడే, జీసస్ ఒక్కడే, రాముడు ఒక్కడే, ఈశ్వరుడు ఒక్కడే, విష్ణువు ఒక్కడే అంతా ఒక్కడే! కొంతమంది పర్షియన్సు వేరు, జోరాష్ట్రియన్సు వేరు అని చెబుతుంటారు. గురునానక్ ఒక్కడేయని సిక్కులు చెబుతారు. రాముడు వేరే అని రామభక్తులు చెబుతుంటారు. కృష్ణుడు వేరే అని కృష్ణభక్తులు చెబుతుంటారు. కాదు కాదు. అభిరుచులనుపట్టి పోతున్నాదిగానీ దైవము ఒక్కడే! నామము, రూపములు వేరు వేరుగా ఉంటున్నాయి. మీ జిహ్వాచాపల్యముచేత నాకు మిఠాయి కావాలి, జిలేబి కావాలి, బర్ఫీ కావాలి, మైసూర్‌పాక్ కావాలి అని ఆశిస్తున్నావు. ఈ బర్ఫీలు, మిఠాయిలు, జిలేబి అన్నింటిలోనున్న చక్కెర ఒక్కటే! జిహ్వాచాపల్యమే యిన్ని విధములైన రుచులు ఆశిస్తున్నాది. ఏపేరైనా చింతించండి, ఏరూపమైనా చూడండి, గమ్యము ఒక్కటే! Goal is one, God is one. దేనినికూడా మనం విమర్శించకూడదు. ఏవికూడను వేరుకాదు. అంతా చేరి ఒక్కటే! ఇలాంటి ఏకత్వము మనం చక్కగా విచారణ చేసినప్పుడే ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. అదే Unity in diversity

**Stars are many but sky is one**
**Bodies are many but life is one**
**Beings are many but breath is one**
**Nations are many but World is one**
**Religions are many but truth is one**

ఈ సత్యం మనం చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇది నాకు యిష్టము, ఇది నాకు ఇష్టములేదని ఏమాత్రము విభజించకూడదు. ఈ విధమైన ఏకత్వము గుర్తిస్తే తప్పక ఆ తత్త్వములో మునుగుతావు. ఎప్పుడు ఏ పనిచేసినా I am God, I am God. అని ఆ భావముతో

sri sathyasai vachanamrutam

నీవు చేస్తూరా! Then you become God. నీ చింతనను బట్టి నీ స్వరూపము బయలుదేరుతుంది. కనుక నీవు అనవసరమైన చింతన చేయకూడదు. అనవసరమైనవి మాట్లాడకూడదు. ఇతరుల మనసు బాధించకూడదు. ఇతరులకు ఏ శ్రమను ఇవ్వకూడదు. ఈ విధమైన తత్త్వమును గుర్తించటానికి ప్రయత్నించాలి.

విద్యార్థులారా! మీకు 5వ తేదీనుండి పరీక్షలు జరుగుతాయి. కొన్ని దినములు ఈ ఉపన్యాసములు మానివేస్తే కొంతవరకు విద్యార్థులకు రెస్టు యిచ్చినట్టవుతుంది. ఎందుకంటే, వారు విద్యకోసం వచ్చారు గానీ వేదాంతముకోసం రాలేదు. కొంత విద్యనుకూడా అభ్యసించాలి. చదవటం జరిగినప్పుడే మీరు వచ్చిన పని పూర్తిగావించుకున్నవారౌతారు. తల్లితండ్రులు ఎంతో ఆశతో మిమ్మల్ని యిక్కడకు పంపించారు. వారినికూడా మీరు సంతృప్తిపరచాలి. ఎందుకంటే వారుకూడా దైవస్వరూపులే! మాతృదేవో భవ, పితృదేవో భవ! మీరు వచ్చిన పని మొట్టమొదట చక్కగా పూర్తి చేసుకొండి. దానిని ఫలవంతము చేసుకున్నప్పుడే స్వామికి ఆనందము. రూములలో మాట్లాడకుండా అనవసర విషయములలో ప్రవేశించకుండా మీ చదువులలో ఏకాగ్రత చేయండి. మంచి 'O' గ్రేడు తీసుకురండి. ఇన్స్టిట్యూట్‌కు మంచి పేరు తెండి. తల్లితండ్రులకు తగినంత ఆనందమునందించండి. మీరుకూడా వచ్చిన పని నెరవేర్చుకొని ఆనందముగా వెళ్లిపోండి.

**(తేదీ 01-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam